రబీలో పెరిగిన పంటల సాగు

- బోరుబావుల్లో సమృద్ధిగా నీరు
- 1,130 హెక్టార్లలో వివిధ పంటలు



మడకశిర మండలం ఎల్లోటి వద్ద సాగు చేసిన రాగి పంట

మడకశిరరూరల్: గతంలో ఎన్నడూ లేనివిధంగా మూడేళ్ల నుంచి రబీ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు బోరు బావుల కింద వివిధ పంటలను సాగుచేస్తున్నారు. మూడేళ్ల నుంచి ప్రతి ఏడాది రబీ సీజన్‌లో సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోందని వ్యవసాయధికారులు కూడా చెబుతున్నారు. నియోజకవర్గంలోని మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ మండలాల పరిధిలో వేరుశనగ, వరి, రాగి, మొక్కజొన్న తదితర పంటలు ఇప్పటికే 1,130 హెక్టార్లలో రైతులు పంటలు సాగుచేశారు.

చెరువులకు కృష్ణా జలాలు

2019 నుంచి 2022 వరకూ మడకశిర మండలంలోని చెరువులను కృష్ణాజలాలు నింపడంతో పాటు గత ఏడాది కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండి ప్రవహించాయి. దీంతో బోరు బావుల్లో మరింతగా భూగర్భజల మట్టం పెరిగింది. వ్యవసాయ బోరు బావుల్లో నీరు సమృద్ధిగా వస్తుండడంతో రైతులు వివిధ పంటలు సాగు చేశారు.

ఆశాజనంగా పంటలు

ప్రస్తుతం సాగుచేసిన పంటలకు తెగుళ్లు కూడా సోకలేదు. పంటలు పచ్చగా కళకళలాడుతుండటంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. పంట దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో అనుకూలంగా నిలుస్తున్నాయి. ఆర్బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన ఎరువులు, మందులు అందించడంతో పాటు పంటల వృద్ధికి రైతులకు పలు సూచనలు, సలహాలను ఇస్తున్నారు.

రెండు ఎకరాల్లో రాగి పంట



రబీలో బోరు బావి కింద రెండు ఎకరాల్లో రాగి పంట సాగు చేశాను. రాగి పైరు వేయడం, కలుపుతీత, ఎరువులు ఇతర ఖర్చులకు ఎకరాకు రూ.10 వేల పెట్టుబడి పెట్టాను. తక్కువ ఖర్చుతో రాగి పంటను సాగు చేసి మంచి దిగుబడి పొందుతున్నాను. ఈ పంటలో ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఖర్చులు పోను రూ. 25 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం రాగి పంటను ప్రోత్సహిస్తూ రాయితీతో విత్తనాలను ఆర్బీకేల ద్వారా పంపిణీ చేసింది. – తిప్పన్న, రైతు, జమ్మానిపల్లి, మడకశిర మండలం

ఆశాజనకంగా పంటలు



బోరు బావుల్లో పుష్కలంగా నీరు వస్తుండటం రబీలో ఐదున్నర ఎకరాల్లో పంటలు సాగు చేశాను. రెండు ఎకరాల్లో రాగి, రెండున్నర ఎకరాలో మొక్కజొన్న, ఎకరాకు పైగా వరి పంటలు వేశాను. పంటలు అశాజనకంగా ఉన్నాయి. రాగి పంటకోత దశలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రోత్సహిస్తుండటం హర్షణీయం. – శ్రీరామరెడ్డి, రైతు, ఎల్లోటి, మడకశిర మండలం

ఎక్కువ విస్తీర్ణంలో సాగు



ఈ ఏడాది రబీలో బోరు బావుల కింద రైతులు సాగు చేసిన వివిధ పంటలకు తెగుళ్లు సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాం. క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సూచనలు, సలహాలను అందిస్తున్నాం. బోరు బావుల్లో నీటి మట్టం పెరగడంతో ఎక్కువ విస్తీర్ణంలో రైతులు పంటలను సాగు చేశారు. – తిమ్మప్ప, ఏఓ, మడకశిర మండలం

క్లుప్తంగా

యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ప్రారంభిస్తున్న నాయకులు

హిందూపురం: ఉపాధ్యాయులకు సంబంధించి అన్ని రకాల సేవలు ఉచితంగా అందజేస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ తెలిపారు. స్థానిక మున్సిపల్ ఆఫీసు పక్కన ఆదివారం యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ అధ్యక్షుడు నరసింహులు, సీనియర్ నాయకులు లక్ష్మిపతి, ముస్తాక్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అగళి: మండల పరిధిలోని మధూడి గ్రామంలో ఆదివారం మట్కా రాస్తున్న వీరేష్, శ్రీనివాసరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ లావణ్య తెలిపారు. మరో ఇద్దరు కరిదాసనపల్లికి చెందిన ముద్దప్ప, మధూడికి చెందిన గోపీనాథ పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు. పట్టుబడిన వారి నుంచి రూ.7 వేల నగదుతో పాటు మట్కా చీటీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

కొత్త చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

హిందూపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న హిట్ అండ్ రన్ నూతన చట్టాన్ని ఉపసంహకరించుకోవాలని జిల్లా ఆల్ ఇండియా ట్రక్కర్స్ అండ్ డ్రైవర్స్ హెల్ప్‌లైన్, లారీ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ శివశంకర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అబ్బాస్, నూర్ మహమ్మద్, షబ్బీర్, సాయి, నంది, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేమన జయంతి



ఊరేగింపులో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి, మధుమతిరెడ్డి

హిందూపురం: త్రైతసిద్ధాంత ప్రచార ప్రబోధానంద సేవా సమితి, రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ముద్దిరెడ్డిపల్లి వద్ద నుంచి బసవనపల్లి సర్కిల్ వద్ద వేమన విగ్రహాన్ని వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు యోగి వేమన జీవిత పరమార్థాన్ని చాటిచెప్పిన మహాసీయుడని కొనియాడారు. ఊరేగింపులో వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, రెడ్డి జేఏసీ అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే సీఎం లక్ష్యం



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

అగళి : ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని హులేకేర గ్రామానికి చెందిన లలితమ్మ, హనుమంతరాయప్ప దంపతుల కుమార్తె హేమశ్రీకి కంటి ఆపరేషన్ చేయించారు. దీంతో ప్రభుత్వం సీఎం సహాయ నిధి కింది మంజూరు చేసిన రూ.10 వేల చెక్కును ఆదివారం కుటుంబ సభ్యులకు అందించారు.

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

పరిగి: మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు ఊటుకూరులో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అక్కంపల్లి, బసవనహళ్లి, దాసరిపల్లి, నేతులపల్లి, ఎర్రగుంట, తిరుమలదేవరపల్లి, విట్టాపల్లి, మూడింద్లపల్లి, హొన్నంపల్లి, కె నరసాపురం, జంగాలపల్లి గ్రామాల్లో కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

చంద్రబాబు దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న మంత్రి ఉషశ్రీచరణ్, చిత్రంలో వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ

పెనుకొండ: 'ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారు. వారి ఆరోపణలకు దీటుగా సమాధానం చెప్పాలి' అని మంత్రి , వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని మావటూరు పంచాయతీలో ఆదివారం మంత్రితో పాటు వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ నాగరాజు, కౌన్సిలర్ సుధాకరరెడ్డి, ఎంపీటీసీ శివయ్యల నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. మహిళలు, ప్రజలు, రైతులతో మాట్లాడిన అనంతరం ప్రచార రథంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మావటూరు కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఉషశ్రీచరణ్ మాట్లాడారు. ఎన్నికల వేళ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలన్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే సంక్షేమ ఫలాలు దక్కేవని, నేడు జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు ఇంటి ముంగిటకే అందుతున్నాయని చెప్పారు. ఈ నెల 23న ఉరవకొండలో ముఖ్యమంత్రి ఆసరా 4వ విడత నిధులను విడుదల చేస్తున్నారని , ఇచ్చిన మాటను మరోసారి జగనన్న నిలబెట్టుకుంటున్నారన్నారు.

పరిగి మండలంలో...

పరిగి: ఎన్నికల సమయంలో టీడీపీ దొంగల ముఠా ప్రజల్లోకి వస్తుందని, మోసపూరిత వాగ్దానాలతో వంచించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ విమర్శించారు. ఆదివారం పరిగి మండలంలో ఆమె నిర్వహిస్తున్న ఆత్మీయ పలకరింపు యాత్ర రెండోరోజు కొనసాగింది. హిందూపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ పాల్గొన్నారు. తొలుత కాలువపల్లిలో కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ సాకమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యులు చిక్కన్న, మారుతీరెడ్డి తదితరులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం కొడిగెనహళ్లి, సేవామందిరం, బిందూనగర్, పెద్దిరెడ్డిపల్లి, సుబ్బరాయనిపల్లి, శాసనకోట, బాలిరెడ్డిపల్లిలో ఆత్మీయ పలకరింపు యాత్ర జరిగింది. సేవా మందిరం ప్రశాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు, అనాథలకు పండ్లను పంచిపెట్టారు. అలాగే భక్త కనకదాస, వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేశారు.

మాట ఇస్తే తప్పని వ్యక్తి జగనన్న

టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని వచ్చినా వైఎస్సార్‌సీపీ ముందు నిలబడవని, జగనన్నను ప్రజల గుండెల్లో నింపుకుని ఎన్నికల్లో తమ ముఖ్యమంత్రిగా మరోసారి ఎన్నుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. పెనుకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల జోలికొస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. వారి జోలికెళ్లాలంటే ముందు తనను దాటి వెళ్లాలని స్పష్టం చేశారు. కార్యకర్తలే పార్టీకి పునాదులని, ప్రాణమున్నంత వరకూ వారిని కాపాడుకుంటానని తెలిపారు.

బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పెద్ద పీట వేశారని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మ తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుతో ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. దేశంలోనే కనీవిని ఎరుగనిరీతిలో పథకాలను అమలు చేస్తున్న రాష్ట్రం ఏపీ మాత్రమేనని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శాసనకోట సర్పంచ్ మాలతి, ఎంపీటీసీ బెస్త నాగజ్యోతి, కాణిపాకం ఆలయ ట్రస్టు మాజీ డైరెక్టర్ మారుతీస్వామి, లాయర్ వన్నేరువప్ప తదితరులు పాల్గొన్నారు.

బాబు హామీలను జనం నమ్మరు



మాజీ మంత్రి నర్సేగౌడ్‌ను కలసిన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప

మడకశిర: వచ్చే ఎన్నికల్లో మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప అన్నారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి స్వగృహాల్లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నీ దాదాపుగా నెరవేర్చారన్నారు. అయితే చంద్రబాబు తప్పుడు హామీలిచ్చి గత ఎన్నికల్లో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. చంద్రబాబు ప్రస్తుతం ఎన్ని హామీలిచ్చినా ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. సమావేశాల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, గుడిబండ జెడ్పీటీసీ భూతరాజు, నాయకులు హనుమంతరెడ్డి, జగన్నాథరెడ్డి,సత్యనారాయణ, బాలక్రిష్ణారెడ్డి, దాసన్న తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలసిన ఈర లక్కప్ప

మడకశిరలో ఆదివారం మాజీ మంత్రి నర్సేగౌడ్‌ను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప కలిశారు. నియోజకవర్గంలో పార్టీని గెలిపించడానికి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని మాజీ మంత్రిని ఆయన కోరారు. గ్రామస్థాయి నాయకులను కూడా కలిసి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఈర లక్కప్పకు మాజీ మంత్రి సూచించారు. అలాగే పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజేష్, మాజీ ఎంపీపీ శాలిని, కదిరేపల్లి సర్పంచు నరసింహమూర్తి తదితర నాయకులను కూడా ఆయన కలిశారు. ఆయన వెంట కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగేగౌడ్ తదితరులున్నారు.

మడకశిరరూరల్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప తెలిపారు. ఆదివారం మడకశిర మండలంలోని కల్లుమర్రి, కదిరేపల్లి, సీ కొడిగేపల్లి పంచాయితీల్లోని గ్రామాల్లో ఆయన పర్యటించారు. మాజీ ఎంపీపీ శాలిని, సర్పంచులు కవిత, నర్సేగౌడు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, నాయకులను కలిసి వైఎస్సార్‌సీపీ గెలుపుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గుడిబండ జెడ్పీటీసీ భూతరాజు, నాయకులు మంజునాథ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి నరసింహమూర్తి, మూర్తి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చురుగ్గా సాగుతున్న కులగణన

గోరంట్ల/లేపాక్షి/అగళి: ప్రభుత్వ ఆదేశాల మేరకు గోరంట్ల, లేపాక్షి, అగళి మండలాల్లో కుల గణన కార్యక్రమాన్ని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు జోరుగా సాగిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ వివరాలను నమోదు చేస్తున్నారు. నిర్దేశించిన గడువులోపు కుల గణన పూర్తి చేయాలని ఆయా మండలాల ఎంపీడీఓలు ఆదేశించారు.

ఈరేగౌడ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

మడకశిర: కుంచిటి వక్కలిగ సంఘం నాయకుడు ఈరేగౌడ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈరేగౌడ్ పేరుతో ఏర్పాటు చేసిన చారిటబుల్ ట్రస్టును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఈరేగౌడ్ సుపరిచుతులన్నారు. ఆయన కుటుంబ సభ్యులు ఈరేగౌడ్ పేరుతో చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న, ఏడీసీసీ బ్యాంక్ మాజీ ఉపాధ్యక్షుడు ఆనందరంగారెడ్డి, రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు, మడకశిర జెడ్పీటీసీ మూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామిరెడ్డి, వైస్ ఎంపీపీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత వీఆర్‌ఓకు నివాళి



విశ్రాంత వీఆర్‌ఓ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ

రొద్దం: మండల పరిధిలోని ఆర్ మరువపల్లికి చెందిన విశ్రాంత వీఆర్‌ఓ సోమశేఖర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం విశ్రాంత వీఆర్‌ఓ కుటుంబ సభ్యులు వైకుంఠ సమారాధన నిర్వహించడంతో ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ హాజరై వీఆర్వో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉపాధి పనుల పరిశీలన

మడకశిరరూరల్: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులను ఆదివారం నుంచి క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీ చేస్తున్నట్లు ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. మెదటిరోజు మెళవాయి, జీవీపాళ్యం, కల్లుమర్రి పంచాయతీల్లోని గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం సభ్యులు పనులను తనిఖీ చేస్తున్నట్లు వివరించారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

హిందూపురం టౌన్: స్థానిక ఎంజీఎం ఉన్నత పాఠశాలల్లో అభయ నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఎంఈఓ గంగప్ప, పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాల క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ అభయ నిస్వార్థ ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు లబ్ధి చేకూరుతోందని అన్నారు.

నేడు కుంభ మహోత్సవం

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం నిధి కుంభ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ధర్మదర్శి రామకృష్ణారెడ్డి, కట్టిమనే గౌడరు తెలిపారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవ విగ్రహంతో రథోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓల నియామకం

మడకశిర: మడకశిర, అగళి మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓ–1లను నియమిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు స్థానిక విద్యాశాఖ అధికారులు తెలిపారు. మడకశిర ఇన్‌చార్జ్ ఎంఈఓ–1గా పెనుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణప్ప, అగళి ఇన్‌చార్జ్ ఎంఈఓ–1గా పరిగి ఎంఈఓ–1 లక్ష్మీదేవిని నియమించినట్లు పేర్కొన్నారు.

మహిళకు గాయాలు

పెనుకొండ: మండల పరిధిలోని జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమాదేవి అనే మహిళ ఆదివారం గాయపడింది. సోమందేపల్లిలోని సాయినగర్‌కు చెందిన ఉమాదేవి కుటుంబీకులతో కలసి ద్విచక్ర వాహనంలో ఎర్రమంచికి వెళ్తుండగా వెంకటరెడ్డిపల్లి సమీపంలోని 44వ జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద వాహనం అదుపు తప్పింది. ఉమాదేవి తలకు బలమైన గాయాలు కావడంతో అనంతపురానికి తరలించారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

మడకశిరరూరల్: మండల పరిధిలోని వైబీ హళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2004–2005 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులందరూ పాఠశాలలో కలిశారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులతో కలిసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరి కష్టసుఖాలను మరొకరు తెలుసుకున్నారు. తమలోని వారికి ఏకష్టం వచ్చినా అందరం అండగా ఉండాలని తీర్మాణించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడల్లో నిజాయితీ ముఖ్యం



పెనుకొండ జట్టుకు కప్, నగదు అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

పెనుకొండ: క్రీడల్లో గెలుపోటములు ప్రధానం కాదని, నిజాయితీ ముఖ్యమని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖామాత్యులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కేవీ.ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మండలంలోని మావటూరులో కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో రెడ్ టెన్నిస్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆదివారం ఫైనల్ మ్యాచ్ మావటూరు, పెనుకొండ జట్ల మధ్య జరగ్గా పెనుకొండ జట్టు విజేతగా నిలచింది. ఈ సందర్భంగా విన్నర్, రన్నర్‌లకు ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ ట్రోఫీలను బహూకరించారు. విజేతకు రూ.50 వేలు, రన్నరప్‌కు రూ.25 వేలు అందజేశారు. మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడైనా క్రీడలను ప్రోత్సహిస్తున్న రాష్ట్రం ఏదైనా ఉందంటే అది ఒక్క ఆంధ్రప్రదేశేనన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ,పట్టణ కన్వీనర్లు నాగలూరుబాబు, బోయ నరసింహ, జెడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీపీ గీత, సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ శివయ్య, కౌన్సిలర్ సుధాకరరెడ్డి, నగర కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

గోరంట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ భార్త చరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కొండాపురం గ్రామ పంచాయితీలోని గాజులవాండ్లపల్లి, ముద్దలకుంటపల్లి, చెడ్డిచెరువుకట్ట, రాగుమాకులపల్లి, కొండాపురం , మరువపల్లి గ్రామల్లో పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో ఆదివారం చరణ్‌రెడ్డి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామల్లో స్థానిక నాయకులతో కలసి ప్రతి గడపకూ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సమరసింహరెడ్డి పాల్గొన్నారు.